# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

## JANUARY - 2016

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

ఆదివారం సాయంత్రం : 6.00 గంటలకు శుభవార్త

బుధవారం సాయంత్రం :6:30 గంటలకు రక్షణ

గురువారం మధ్యాహ్నం : 2:30 గంటలకు రక్షణ

ప్రతి ఆదివారం ఉదయం :7:00 గం॥ మనకాపరి టి.వి (తెనాలిగుంటూరు ఏరియాలో)

ప్రసంగీకులు :జాషువా గూటం

రిక్కీ గూటం

రోనీ గూటం

పై కార్యక్రమములను టి.విలో చూడండి.
మీ బంధు మిత్రులను కూడ ప్రోత్సహించండి.
ఉచిత బైబిలు కోర్సుకొరకు మాకు ఈరోజే వ్రాయండి.


**SATYA VANI**

**P.O.BOX.80, KAKINADA**

**Pin : 533004, Ph : 0884 -2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



P.o. Box -80, KAKINADA, A.P. 533 001
Ph : 0884 - 2363722, 98489 98547

Editor :
**JOSHUA GOOTAM**



Pleading for Restoration of First Century Christianity

సంపుటి-36 జనవరి-2016 సంచిక-6


## ఐతియోపీయుడు మార్పుజెందుట

### *(Conversion of the Ethiopian)*

అపొస్తలుల కాలములలో పరిశుద్ధాత్మ వలన నడిపింపబడిన వారు వాక్యమును బోధించిరి. వారు అన్ని చోట్ల ప్రకటించిన సువార్త అంతయు యేసు ప్రభువు వారికిచ్చిన గొప్ప ఆజ్ఞను బట్టి యుండెను.

పౌలు అనునతడు క్రైస్తవులను హింసించు సమయమందు అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయములోని సంఘటనలు జరిగెను. యెరూషలేములో గొప్పహింస రాగా క్రీస్తు శిష్యులు లోకమంతటా చెదిరిపోయి సువార్తను ప్రకటింప నారంభించిరి. ఫిలిప్పు అనునతడు యెరూషలేము సంఘములో పరిచారకునిగా యుండెను. అతడు సమరయ పట్టణము వరకును వెళ్ళి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను. జన సమూహములు విని ఫిలిప్పు చేసిన సూచక క్రియలను చూచినందున అతడు చెప్పిన మాటలయందు విశ్వసించిరి. అంతేకాదు సువార్తను నమ్మిన పురుషులును స్త్రీలును ఆ పట్టణమందు బాప్తిస్మము పొందిరి.

సమరయువారు దేవుని వాక్యము అంగీకరించిరని యెరూషలేములోని అపొస్తలులు విని పేతురును, యోహానును వారి యొద్దకు పంపిరి. ఆ ఇద్దరు అపొస్తలులు సమరయకు వచ్చి

వారు పరిశుద్ధాత్మను పొందవలెనని వారి కొరకు ప్రార్థన చేసిరి.

ప్రభువు దూత ఫిలిప్పునకగుపడి నీవు లేచి దక్షిణముగా వెళ్ళి యెరూషలేము నుండి గాజాకు పోవు అరణ్యమార్గము ను కలిసికొమ్మని చెప్పగా అతడు లేచి వెళ్లెను. అప్పుడు ఐతియోపీయుల రాణియైన కందాకే క్రింద మంత్రియై ఆమె యొక్క ధనాగారమంతటి మీదనున్న ఐతియోపీయుడైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చి యుండెను. అతడు తిరిగి వెళ్ళుచు తన రథముమీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండెను. అప్పుడు ఆత్మ ఫిలిప్పుతో, నీవు ఆరథము దగ్గరకు పోయి దానిని కలిసికొనుమని చెప్పెను.

యెరూషలేము నుండి తిరిగి వెళ్ళుచున్న ఆ నపుంసకునికి క్రీస్తును గూర్చియు, రక్షణగూర్చియు, పరిశుద్ధాత్ముడు అద్భుతరీతిగ బోధింపగలడు గాని క్రీస్తుయిచ్చిన ఆజ్ఞలో ఆపని మానవులకు అప్పగింపబడెను. మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి యను ఆజ్ఞను క్రీస్తు అపొస్తలుల కిచ్చెను. వారానాడు బోధించిన వాక్యము ద్వారా పరిశుద్ధాత్ముడు పని చేసెను. ఈనాడు కూడ బోధకుడు బోధించుచున్న లేఖనముల ద్వారా దేవుని ఆత్మ పనిచేయును. ప్రకటింపబడుచున్న సువార్త నమ్ము ప్రతి వానిని రక్షించుటకు దేవుని శక్తియై యున్నది(రోమా 1:16). దేవుని దూత ఐతియోపీయుని కగుపడలేదు. గాని అతడు బోధకుడైన ఫిలిప్పునకగుపడి హెచ్చరికలిచ్చెను. సువార్తను వినిన బోధకునితోదేవుని ఆత్మ ఈసందర్భములో కలిపెను.

యెరూషలేములో ఆరాధించి తిరిగి ఐతియోపీయకు వెళ్ళిపోవుచున్న అతడు గొప్ప అధికారము గలవాడు. అతడు ఐతియోపీయుల రాణియైన కందాకే యొక్క ఆర్థిక మంత్రి. అతడు యూదుడు లేక యూదా మతప్రవిష్టుడై యుండ వచ్చును. అతడు ప్రయాణము చేయుచు యెషయా వ్రాసిన గ్రంథమును చదువు చుండెను. గాని అతనికి క్రీస్తుని గూర్చిగాని క్రైస్తవ్యమును గూర్చిగాని ఏమియు తెలియదు. అయితే అతడు లేఖనము నందు చదువుచున్న భాగమేదనగా "ఆయన గొర్రెవలె వధకు తేబడెను. బొచ్చు కత్తిరించువాని యెదుట గొర్రెపిల్ల ఏలాగు మౌనముగా ఉండునో అలాగే ఆయన నోరు తెరవకుండెను. ఆయన దీనత్వమును బట్టి ఆయనకు న్యాయ విమర్శ దొరుకకపోయెను. ఆయన సంతానము

ఎవరు వివరింతురు?ఆయన జీవము భూమిమీద నుండి తీసివేయబడినది"

సువార్తకుడైన ఫిలిప్పు ఈ నపుంసకుని రధము దగ్గరకు పరుగెత్తు కొనిపోయి అతడు ప్రవక్తయైన యెషయా గ్రంధము చదువుచుండగా విని,నీవు చదువునది గ్రహించుచున్నావా?అని యడిగెను.అందుకా నపుంసకుడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి,రధమెక్కి తనతో కూర్చుండుమని ఫిలిప్పును వేడు కొనెను. అప్పుడు నపుంసకుడు ప్రవక్త యెవనిని గూర్చి యీలాగు చెప్పు చున్నాడు?తన్ను గూర్చియా,వేరొకని గూర్చియా?దయచేసి నాకు తెలుపుమని ఫిలిప్పు నడిగెను.

"అందుకు ఫిలిప్పునోరు తెరచి, ఆ లేఖనమును అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను". యేసు జీవితములోని ప్రతిఘట్టమును ప్రవక్తలచే ముందుగనే చెప్పబడెను. ఈ ఐతియోపీయ మనుష్యుడు సత్యారాధికుడు గనుక పాతనిబంధన ప్రవచనములను బాగుగా యెరిగి యుండెను. ఫిలిప్పు యేసుయొక్క జననము నుండి ఆయన మరణము, పునరుత్థానము,ఆరోహణము వరకు గల కధను అతనికి బోధించెను.అతడు ఎదురు చూచుచున్న రక్షకుడు యేసే అని అతడు గ్రహించాడు.యేసుపాతనిబంధన ప్రవచనముల నేరవేర్పని నపుంసకుడు గ్రహించెను.యేసుయొక్క జనన మరణ ములను గూర్చి అతడు చదువుచున్న లేఖనముపై ఆధారపడి ఫిలిప్పు అతనికి సువార్త బోధించెను.యేసే నిజమైన రక్షకుడని అతడు గ్రహించగానే ఆయనను సేవింపవలెనని అతడు ఆశించెను.

యేసు చనిపోయి తిరిగి లేచిన తరువాత తన శిష్యులకిచ్చిన గొప్ప ఆజ్ఞను గూర్చి ఫిలిప్పు ఈ ఐతియోపీ యునికి బోధించెను.యేసుఇట్లు చెప్పెను. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి.నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును"(మార్కు 16:15,16)."మీరువెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి.తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మము మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి"(మత్తయి 28:19,20). ఫిలిప్పు అతనికి క్రీస్తు సువార్తను బోధించు చు వారు త్రోవలో వెళ్లుచుండగా నీళ్ళు న్న ఒకచోటికి వచ్చినప్పుడు నపుంసకుడు

ఇదిగో నీళ్ళు;నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను.

ఫిలిప్పు అతనికి క్రీస్తుసువార్తను ప్రకటించినప్పుడు బాప్తిస్మము యొక్క అవుసరతను గూర్చి బోధించెను. మీరు మారుమనస్సు బొంది పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తునామమున బాప్తిస్మము పొందుడియని పరిశుద్ధాత్మని ఆజ్ఞను గూర్చి అతనికి తెలియజేసెను. ఫిలిప్పు లేఖనముపై ఆధారపడి ఈ నపుంసకునికి క్రీస్తుగూర్చి బోధించగా అతడు విశ్వసించెను. మారు మనస్సుబొంది బాప్తిస్మముపొందుటకు తక్షణమే అంగీకరించెను. అయితే అతడు బాప్తిస్మము పొందుటకు ముందు ఇంకొక సంగతిని చేయవలసి యుండెను. క్రీస్తునందున్న అతని విశ్వాసమును నోటితో ఒప్పుకొనవలెను. ఏలయనగా "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును"అని యేసు చెప్పెను(మత్తయి 10:32,33). అందువలన బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని నపుంసకుడు ఫిలిప్పునడుగగా, అతడు నీవు పూర్ణహృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను.

అప్పుడు ఫిలిప్పు,నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలోనుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను.

లేఖనముల ప్రకారము బాప్తిస్మమనగా నీళ్ళలో ముంచుబడుట యని అర్థము. విశ్వసించినవారు,తమపాపముల విషయమై మారుమనస్సు పొందినవారు, తమ పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున ముంచడము పొందవలెను. ఇక్కడ ఫిలిప్పు నపుంసకునికి నీళ్ళలో ముంచడము యిచ్చుటను గూర్చి మనము గ్రహించి యుంటిమి. బాప్తిస్మము పొందిన తరువాత నపుంసకుడు పాపవిముక్తుడై, రక్షింపబడినవాడై సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను. అతడిప్పుడు క్రైస్తవుడయ్యెను. అందువలన సంతోషముతో తన ప్రయాణములో ముందుకు సాగెను.

మిత్రుడా! నీ విషయమేమిటి? సంతోషముతో నీ జీవిత యాత్రను గడు

పవలెనంటే క్రీస్తునందు విశ్వాస ముంచుము,నీ పాపముల విషయమై మారుమనస్సు బొందుము,క్రీస్తును ఒప్పు కొని బాప్తిస్మము పొంది రక్షించబడుము. ఇదిగో ఈ రోజే అనుకూల సమయము, ఇదియే రక్షణదినము!!

## సంఘములో స్త్రీల పాత్ర
## *(The Role of Women in the Church)*

ప్రభువైన దేవుడు సృష్టిలోని ప్రతిదానిని ఐదు దినాలలో సృజించారు. ఆరవదినమున ఆయన స్త్రీని,పురుషుని ఆయన పోలికలో సృజించారు.దేవుడు ప్రతిదానిని సృజించి అదిమంచిదైనట్టుగా చెప్పారు.అయితే నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదు;వానికి సాటియైన సహాయము వానికొరకు చేయుదుననుకొనెను.దేవుడైన యెహోవా ప్రతిభూజంతువును ప్రతిఆకాశ పక్షిని నేలనుండి నిర్మించి,ఆదాము వాటికి ఏ పేరుపెట్టునో చూచుటకు వాటిని అతని యొద్దకు రప్పించెను.జీవముగల ప్రతి దానికిని ఆదాము ఏ పేరు పెట్టెనో ఆ పేరు దానికి కలిగెను.అప్పుడు ఆదాము సమస్త పశువులకును ఆకాశ పక్షులకును సమస్త భూజంతువులకును పేరులు పెట్టెను.ఆయన ఆదామునకు గాఢ నిద్ర కలుగజేసి అతడు నిద్రించినపుడు అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి ఆ చోటును మాంసముతో పూడ్చివేసెను. తరువాత దేవుడైన యెహోవా తాను ఆదామునుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసికొని వచ్చెను"(ఆదికాం 2:18-22).

ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యముతో ప్రత్యేకమైన అవుసరంతో స్త్రీ నిర్మింప బడింది.స్త్రీ భార్యగా,తల్లిగా,కుమార్తెగా, సోదరిగా ఇంకాఅలా ఎన్నోపాత్రలు కలిగి ఉంది. స్త్రీ తన బాధ్యతలను సరియైన రీతిలో నిర్వర్తించినపుడు ఆమె కుటుంబము దీవింపబడుతుంది,అలా కానిచో ఆకుటుంబము ఇబ్బందులు పాలవుతుంది.

కుటుంబానికి యజమాని భర్తే అయినప్పటికీ స్త్రీ లేకుండా ఆ కుటుంబం పరి పూర్ణం కాదు.పురుషులు ఇంటిలోను, సంఘంలోను నాయకులు గాని స్త్రీలు మాత్రం ఇంటిలోను సంఘంలోను బాధ్య తలు కలిగి ఉన్నారు. స్త్రీ తన కుటుంబం యోగక్షేమాలు చూచుకొనే ఒక అద్భుతమైన సహాయకురాలు,తల్లి, పురుషునికి అద్భుతమైన సహచరి స్త్రీ.

దేవుడు భూమిపై స్థాపించిన మొదటి వ్యవస్థకుటుంబము.ఆయన సృష్టించిన ప్రతిదానికి కొన్ని నియమాలు

ఏర్పరిచారు. ఆ నియమాలు అనుసరించి నంతకాలం మనం శాంతి,సంతోషాలతో కూడిన జీవనం సాగిస్తాం. దేవుడు మానవుని తన పోలికతో సృజించారు. "పురుషుడైతే దేవుని యొక్క పోలికయు మహిమయునై యున్నాడు(1కొరి 11:7). "నీ ముఖము చెమటకార్చి ఆహారము తిందువు" (ఆది 3:19,1తిమె 5:8). దేవుడు ఇప్పటి వరకు ఈ చట్టాన్ని మార్చ లేదు. హవ్వ న్యాయకత్వం కోసం నిర్ణయం తీసికొని సాతాను యొక్క ఉచ్చులో పడింది.

దేవుడు మొదటిగా పురుషుని సృజించి ఆ తరువాత అతనికి సహకారి గా స్త్రీని సృజించారు(1కొరి 11:8). స్త్రీ బలహీనురాలు అనగా దయ,ప్రేమతో నిండినది. గనుక త్వరగా తేలికగా ఇతరుల వల్ల ప్రభావితం కాగలదు. భౌతికంగా చూస్తే పురుషుని కంటే ఆమె బలహీనురాలు. ఒక తీగవలె ఇతరులపై ఆధారపడులాగున స్త్రీలు సృజింపబడ్డారు. బాల్యంలో తండ్రి,యౌవ నంలో భర్త,వృద్ధాప్యంలో బిడ్డలు ఆమెను గూర్చి జాగ్రత్త తీసుకుంటారు. యౌవన స్త్రీలకు బోధించవలసిందిగా పౌలు వృద్ధ స్త్రీలను ప్రోత్సహిస్తున్నాడు.

"వృద్ధ స్త్రీలు ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండవలెననియు దేవుని వాక్యము దూషింపబడకుండునట్లు యౌవన స్త్రీలు తమ భర్తలకు లోబడి యుండి తమ భర్తలను శిశువులను ప్రేమించువారును స్వస్థబుద్ధి గలవారును పవిత్రులను ఇంటినుండి పనిచేసికొను వారును మంచి వారునై యుండవలెనని బోధించుము"(తీతు 2:3-5).

పురుషుడు కుటుంబానికి శిరస్సు,నాయకుడు. "స్త్రీలారా! ప్రభువునకు వలె మీ సొంత పురుషులకు లోబడి యుండుడి(ఎఫెసి 5:22,కొలస్స 3:18, 1 పేతురు 3:1). భర్తలు తమ భార్యలను ప్రేమించినపుడు,భార్యలు తమ భర్తలకు లోబడియుండినపుడు ఆ ఇల్లు ఆనందం తో ఆశీర్వాదంతో నిండినదౌతుంది (కొలస్స 3:19) "స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణవిధేయతతో నేర్చుకొన వలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదే గాని ఉపదేశించుటకైనను పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను. మొదట ఆదాము తరువాత హవ్వయును నిర్మింపబడిరి కారా? మరియు ఆదాము మోసపరచబడ లేదు గాని స్త్రీ మోసపరచబడినను అతడు మోసపరచబడలేదు. స్త్రీ మొదటిగా మోస గింపబడి మొదటిగా దేవుని ఆజ్ఞకు అవిధేయురాలైంది.

పరిశుద్ధగ్రంథం స్త్రీకి ఎట్టి

ప్రాధాన్యత నిస్తుంది? పురుషుడు దేవుని పోలికతో సృజింపబడ్డాడు. పురుషుడు మోసగింపబడలేదు. పురుషునికి ప్రధమ స్థానం ఇయ్యబడిందిత. స్త్రీలు అలకాదు. ఆమె బాగా మంచిది లేదా చాలా చెడ్డది అయిఉంటే తప్ప సాధారణంగా స్త్రీలపేర్లు బైబిలులో చెప్పబడలేదు. స్త్రీల యొక్క సంఖ్యగాని వారిపేర్లుగాని జనన పట్టికలో *(Geneology)*చెప్పబడలేదు. బైబిలులోని ఏ పుస్తకము స్త్రీలచే వ్రాయబడలేదు.

యాకోబునకు పంద్రెండుగురు కుమారులున్నారు. వారి పంద్రెండు గోత్రాలను దేవుడు దీవించారు గాని యాకోబు కుమార్తె దీనా పేరుతో ఒక గోత్రం కూడా లేదు. దేవాలయములోని సేవలో ఆడయాజకురాలు ఉండాలని దేవుడు ఎక్కడా చెప్పలేదు. న్యాయాధిపతులు గ్రంథం4వ అధ్యా॥లో మనము దెబోరాఅనే ఒక ప్రవక్త్రి గురించి చదువుతాము. అప్పటిలో ఇశ్రాయేలీయులలో సమర్థులైన పురుషులు లేరు. గనుకనే దెబోరా, లాంటి వారున్నారు. తన తరపున ప్రజలతో మాట్లాడుటకు గానుదేవుడు ప్రవక్తలను నియమించారు. దేవుడు తన ప్రజలపై రాజులుగా నుండుటకు పురుషులనే నియమించారు గాని యూదాలో గాని ఇశ్రాయేలులో గాని ఏలికలుగా రాణులు లేరు.

యేసుప్రభువు యొక్క పంద్రెండుగురు శిష్యులు పురుషులే స్త్రీలు లేరు. సంఘ కార్యక్రమాలలో తమకు సహాయపడుటకు గాను అపొస్తులులు ఏడుగురు పెద్దలను ఏర్పచుకున్నారు. వారిలో స్త్రీలు ఎవరు లేరు(అపొ.కా. 6:5). పెద్దల యొక్క అధ్యక్షుల యొక్క అర్హతలను గూర్చి పౌలు ఇలా వ్రాస్తున్నాడు. "ఎవడైనను అధ్యక్షపదవినాశించిన యెడల అట్టివాడు దొడ్డపనిని అపేక్షించుచున్నాడను మాట నమ్మదగినది. అధ్యక్షుడగు వాడు నిందారహితుడు, ఏకపత్నీ పురుషుడును తన ఇంటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను(1తిమో 3:1-3, తీతు1:5-9). పెద్దలుగా, అధ్యక్షులుగా ఉండవలసిన స్త్రీల యొక్క అర్హతలు పరిశుద్ధగ్రంథంలో ఎక్కుడా చూడము. తనతో పాటు మంచి పరిచర్య చేసిన స్త్రీలయిన కెంక్రెయలోని ఫీబె అను సహోదరిని గురించి, ఫిలిప్పీ సంఘంలో యువోదియ్య, సుంటుకే అను వారిని గురించి పౌలు వ్రాసాడు(రోమా 16:1;ఫిలి 4:2,3).

లూకా 8వ అధ్యాయములో కొందరు స్త్రీల పేర్లను వ్రాసాడు. దయ్యాలనుండి విడుదల పొందిన మగ్దలేని మరియ, హేరోదు గృహనిర్వాహకుడగు కూజా భార్యఅయిన యోహన్నా, సూసన్నా ఇంకా అనేకమంది స్త్రీలు

తమకు కలిగినదానితో సేవచేసిన వారిపేర్లు ఈ స్త్రీలు యేసు ప్రభువును సిలువపునరుద్ధానము వరకు వెంబడించారు(మత్త27:55,28:1;మార్కు16:1). క్రీస్తుశరీరము క్షేమాభివృద్ధిచెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును,ఆయన కొందరిని అపొస్తులులను గాను, కొందరిని సువార్తికులను గాను, కొందరిని కాపరులను గాను, కొందరిని ఉపదేశకులను గాను నియమించెను(ఎఫెసి 4:11).

గనుక సంఘములో స్త్రీ పాత్ర ఏమిటి? "స్త్రీలు సంఘములో మౌనముగా ఉండవలెను,వారు లోబడవలసినదేగాని మాటలాడుటకు వారికి సెలవులేదు. ఈలాగు ధర్మశాస్త్రము చెప్పుచున్నది. వారు ఏమైనను నేర్చుకొనగోరిన యెడల ఇంట తమతమ భర్తలను అడుగవలెను. సంఘములో స్త్రీ మాటలాడుట అవమానము(1కొరి 14:34,35).యోహాను బాప్తిస్మము మాత్రమే ఎరిగిన అపొల్లో సమాజమందిరంలో మాట్లాడడం అకుల, ప్రిస్కిల్ల విన్నారు.వారు అతని చేర్చుకుని దేవుని మార్గము మరిపూర్తిగా అతనికి విశదపరచిరి.ఇది వారు బాహాటంగా చేయలేదు(అపొ.కా. 18:25,26). క్రైస్తవురాలుగా ఆమె దేవునిని క్రమంగా ఆరాధించాలి.స్త్రీలు దేవుని కుటుంబములోని భాగము,ఆయన శరీరములోని సభ్యులు.

ఆత్మతోను,సత్యముతోను ఆమె దేవునిని ఆరాధించవలెను.దేవుని సేవకొరకు హృదయాన్ని ఇవ్వాలి(లూకా 8:1-3; నిరమ్మ 35:25-26).తమ పిల్లలకు ఇతర యౌవనులకు బోధించాలి (తీతు 2:3-5).సువార్త విస్తరణలో కష్ట పడు వారికి స్త్రీలు సహాయపడాలి.ఫీబె, యువోదియ,సుంటుకేలవలె.

ఆది సంఘములోని స్త్రీలు మనకు మాదిరి. పేతురు కొరకు ప్రార్థించు లాగున మార్కుతల్లియైన మరియ తన గృహాన్ని పరిశుద్ధులకు తెరచింది(అపొ.కా.12:12).గృహాయజమానురాలు తన ఇంటిలో స్థలాన్ని ప్రార్థనకొరకు,కూడికలకొరకు ఇవ్వాలి. యొప్పేలోని ఒక క్రైస్తవ స్త్రీ తబిత లేదా దొర్కా అనేక సత్కార్యాలు,ధర్మకార్యాలు చేసింది.సంఘములోని బీదలై ఇతర స్త్రీలకు ఆమె సహాయం చేసింది.బీదవిధవరాండ్రకోసం వస్త్రాలు,అంగీలుకుట్టింది (అపొ.కా.9:36-43).ఈ విధంగా అనేక రీతులు స్త్రీలుఇతరులకు సహాయపడాలి. అపొ.కా.16:11-15 వరకుఉన్న భాగంలో మనము లూదియ అను ఒక సహోదరి మార్పుచెందడం గురించి చూస్తాం. ఆమె,ఆమె ఇంటివారు

బాప్తిస్మము పొందిన వెంటనే ఆమె దైవసేకుల వర్గానికి ఆతిధ్యమిచ్చింది. త ద్వారా దేవుని వాక్యం ఆసియా అంతట వ్యాప్తిచెందింది. ఆతిధ్యము చేయమరువ కుడి. దాని వలన కొందరు ఎరుగని వారికి స్త్రీలు వాక్యన్ని బోధించవచ్చు.

మంచి దేవుడు స్త్రీలకు పురుషుల కు వివిధ పాత్రలు కేటాయించారు.గాని దేవుని ఆజ్ఞలు మాత్రము అందరికి ఒక్కటే. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు.ఇందులో యూదుడని,గ్రీసు దే శస్థుడని లేదు,దాసుడని స్వతంత్రుడని లేదు,పురుషుడని స్త్రీ అని లేదు యేసుక్రీస్తు నందు మీరందరును ఏకముగా ఉన్నారు. మీరు క్రీస్తుసంబంధులైతే ఆ పక్షమందు అబ్రహాము యొక్క సంతానమై యుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు" (గలతీ 3:27:29).

మనము నిర్ణయించబడిన పాత్ర లో నిలచియుండి ఆయన ఆజ్ఞలకు విధే యులమగుతూ ఆశీర్వదింపబడిన వారంగా ఆనందముతో ఇప్పుడును ఎల్లప్పుడును ఉందుము గాక!

– కబిత గూటం

## యేసుప్రభువు చేయని అద్భుతములు

## *(Miracles Jesus did not Perform)*

యేసు జీవిత చరిత్రను తెలియ జేయు నాలుగు సువార్తలు ఆయన చేసిన 37 ప్రత్యేక అద్భుతములను గూర్చి తెలియ జేస్తాయి.ఆయన మనమధ్య పరిచర్య చేసిన కాలములో కొన్ని రొట్టెముక్కలతో వేలకొలది జనులకు ఆహారము పెట్టారు. తుఫానును గద్దించి నిమ్మళింప జేసారు, నీళ్లపై నడిచారు.ఆయన కుంటివారిని, గ్రుడ్డివారిని,చెవిటివారిని బాగుచేసారు. చనిపోయినవారిని సయితము లేపారు.

యేసు చేసిన అద్భుతములను పఠించి ధ్యానించుట ద్వారా మనం ఎంతో నేర్చుకొనగలము.అయితే యేసు చేయని కొన్ని అద్భుతములను గూర్చి ఇప్పుడు పరీక్షించుదము.ఫలాని అద్భుతము చేయవలెనని కొందరు ఆయనను కోరగా అట్లు చేయుటకు ఆయన నిరాక రించారు.

అరణ్యములో ఆయన ఉపవాస ముండిన తరువాత యేసు సాతానుచే శోధింపబడ్డారు.అపవాది ఆయనతో, "నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపింపుమని"చెప్పాడు. అట్లుచేస్తే ఆయనశక్తిని దుర్వినియోగం

చేసినట్లేయగును గనుక"మనుష్యుడు రోట్టెవలన మాత్రము జీవింపడు గాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాట వలన జీవించును అని వ్రాయబడి యున్న దని"చెప్పి ఆయన వానిని నిరాక రించారు.(మత్తయి 4:3-4).

సమరయలో ఒక గ్రామము ఆయనను చేర్చుకొన లేదు."ఆయన శిష్యు లైన యాకోబును యెహానును అదిచూచి ప్రభువా,అకాశమునుండి అగ్నిదిగి వీరిని నాశనము చేయునట్లు మేమాజ్ఞాపించుట నీ కిష్టమా అని ఆయననడుగగా ఆయన వారితట్టు తిరిగి వారిని గద్దించెను" (లూకా 9:51-54)."మరియు మీరు ఎట్టి ఆత్మగలవారో మీరెరుగరు. మనుష్యుల ఆత్మను రక్షించుటకే గాని నశింపజేయుటకు రాలేదనెను".

గెత్సెమనేలో యేసునుబంధించు టకు జనసమూహములు రాగా యేసు పేతురుతో,"ఈ సమయమున నేను తండ్రిని వేడుకొనలేననియు వేడుకొనిన యెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహ ముల కంటె ఎక్కువమంది దూతలను ఇప్పుడే నాకు పంపడనియు నీవనుకొను చున్నావా?"యని అడిగెను(మత్త 26:51, 54).యేసు చేయని అద్భుతము ఇదొకటి.

ఆయనకు తీర్పుజరుగుచున్న సమయములో ఆయన అద్భుతములు చేయవలెనని ఆయన శత్రువులు ఆయనను రెచ్చగొట్ట ప్రయత్నించిరి గాని ఆయన వారి కోరికమన్నించలేదు.వారి యొక్క దుష్టకోరికలను సంతృప్తి పరచుట కాయన శక్తి ఉద్దేశించబడలేదు(మత్త 26: 67-68; లూకా 23:8-9).

చివరిగా ఆయన సిలువ మీద వ్రేలాడుచుండగా,"నీవు దేవుని కుమారు డవైతే సిలువ మీద నుండి దిగుమని" ఆయన శత్రువులు ఆయనను దూషించిరి (మత్త27:40).ఆయన దేవునికుమారుడే. ఆయనకు అట్టి శక్తి యున్నది.గాని యితరులు జీవించునట్లు ఆయన మరణించుటకు ఎంచుకొన్నారు.

క్రొత్తనిబంధనలో యేసు యొక్క అద్భుతములను స్టడీచేస్తే ఆయన తన్ను గూర్చి చెప్పుకొన్నవి, అపొస్తలులు చెప్పినవి యధార్థమని రుజువగును (యోహాను 20:30,31).ఆయన దేవుని కుమారుడని ఆయన క్రియలు సాక్ష్యమిచ్చుచున్నవి(హెబ్రీ 2:1-4). ఆయన చేయని అద్భుతములు కూడ ఆయన నిజముగా దయగల దేవుని కుమారుడని రుజువుచేయుచున్నవి!

– రేండీవాన్

# గొప్ప ప్రాయశ్చిత్త దినము-2
## *(The Great Day of Atonement -2)*

ఈ పాఠముతో లేవీకాండము 16:1-34లో వర్ణించబడిన గొప్పబలులు వాటి ప్రయోజనము మొ॥గు వాటిని చదివి లేవీయుల బల్యర్పణ పద్ధతి యొక్క స్టడీని ముగించుకొందము. ఈ దినమున అహరోను తన్నుతాను సిద్ధపరచుకొన వలెను. అహరోను యొక్క సిద్ధపాటు పలు విధములుగా యుండును.

**పరిశుద్ధత కొరకు,అందము కొరకు వస్త్రములు:**

గొప్పప్రాయశ్చిత్తదినమునకు మరియు 364దినములు అహరోను తన కొరకు ప్రత్యేకముగా తయారుచేయబడిన దుస్తులను ధరించెను అవి అలంకార మును ఘనతయు కలుగునట్లు కుట్టబడెను(నిర్గమ 28:2).అవి వివిధ వర్ణములతో తయారుచేయబడిన వస్త్రములు. ఇశ్రాయేలు జనాంగమునకు దేవుని ప్రతినిధిగా అహరోను పని చేయును.

ప్రాయశ్చిత్తదినమున అహరోను ప్రత్యక్షగుడారములోనికి వెళ్లి ఆదుస్తులను అక్కడ విడిచిపెట్టవలెను. అతడు స్నానము చేయవలెను. నిజానికి అదొక బాప్తిస్మము వంటిది. తదుపరి అతడు ప్రతిష్ఠతమైన చొక్కాయి తొడుగుకొని,సన్ననినారలాగు ను ధరించి సన్ననార దట్టీకటుకొని,సన్న నారపాగా పెట్టుకొనవలెను. అప్పుడతడు ఆ రోజు బలిగా అర్పింపబడు జంతు వులను స్వీకరించును.

**బలియర్పణలకు ఐదు జంతువులు**

ప్రాయశ్చిత్తదినము కొరకు అయిదు జంతువులు సిద్ధపరచబడెను. మొదటిగా అహరోను కొరకు, యాజకులైన లేవీయులందరి కొరకైన ఒకకోడెదూడ. యాజకులైన లేవీయు లందరి పాపపరిహారార్థముగా అర్పింపబడుటకు రెండు మేక పిల్లలు. మొదటి మేక యెహోవా పేరిటను, రెండవ మేకవిడిచిపెట్టే(అజాజేలు)మేక. ఈ రెండు మేకలు ఒకే బలిగా పరిగణింప బడును. తదుపరి ప్రజల కొరకు దహనబలిగాయుండే మరి యొకపొట్టేలు. "మరియు అహరోను ఇశ్రాయేలీయుల సర్వసమాజము నొద్దనుండి పాపపరిహా రార్థబలిగా రెండు మేకపిల్లలను,దహన బలిగా ఒకపొట్టేలును తీసికొనిరావలెను" అని లేవీ 16:5 చెప్పుచున్నది. 'పరిశుద్ధ స్థలములో ప్రాయశ్చిత్తము చేయుటకు అహరోను లోపలికి పోవునప్పుడు,బయ టకి వచ్చువరకు ఏమనుష్యుడును ప్రత్య క్షపు గూడారములో ఉండకూడదు"అని

లేవీ 16:17 చెప్పుచున్నది.ప్రజలందరు ఒక దు:ఖసమాజముగా కూడియుందురు.ప్రధానయాజకుడు నిర్ణీత వస్త్రములను ధరించి ఆనాటి సంస్కార యాగములు చేయుటకు సంసిద్ధుడైయున్నాడు.వధించబడే అయిదు జంతువులు ఒకవారం మట్టుకు వేరు చేయబడి కళంకమేమైనను యున్నదేమోయని ఒక్కొక్కటి నిశితముగా పరీక్షింపబడి యున్నది.ఈ జంతువుల యొక్క నిష్కళంక పరీక్ష క్రీస్తుయొక్క ఆత్మీయ పరిపూర్ణతకు సాదృశ్యమై యున్నది.గనుక అవన్నియు కల్వరిపై క్రీస్తు యొక్క నిజమైన బలికి ఛాయరూపకముగా యున్నవి.

తదుపరి ఈ జంతువులను దేవునికి అర్పించుట జరుగును.అప్పటి నుండి అవి దేవునికి చెందును.అహరోను ఆ రెండు మేకపిల్లలపై చీటీలువేయును ఒకటి యెహోవాది.రెండవది విడిచిపెట్టబడే అజాజేలుఅనునది.

**అహరోను అతివరిశుద్ధస్థల మొదటి ప్రవేశము:**

మొదట అహరోను యాజకుల పాపపరిహారార్థము ఒక కోడెదూడను వధించును.తదుపరి దేవుడు చెప్పిన రీతిగా దహనబలి పీఠము నుండి అగ్నిని అతడు తన ధూపార్తిలోనికి తీసికొని దానిపై సాంబ్రాణి ధూపము వేయవలెను. సాంబ్రాణి ధూపము ప్రార్థనకు సూచనగా యున్నది.అహరోను ఆ ధూపమును అతిపరిశుద్ధస్థలములో వేయవలెను(లేవీ 16:13).ఆ ధూపము వెంటనే మేఘము వలె శాసనముల మీదనున్న కరుణాపీఠమును కమ్మును.అతడు అతిపరిశుద్ధస్థలములోనికి ప్రవేశించుచున్నాడు.గనుక తాను చావకుండునట్లు దేవుడు చెప్పినట్లు సమస్తమును చేయవలెను."అప్పుడతడు ఆ కోడె రక్తములో కొంచెము తీసికొని తూర్పు ప్రక్కనకరుణా పీఠము మీద తన వ్రేలితో ప్రోక్షించి,కరుణాపీఠము ఎదుట తన వ్రేలితో ఆ రక్తములో కొంచెము ఏడు మారులు ప్రోక్షింపవలెను"(లేవీ 16:14). ప్రత్యక్షగుడారము ముఖము తూర్పు వైపు ఉండెను, కరుణాపీఠము కూడ తూర్పు వైపున ఉంచబడెను. ఆ రక్తమును అతడు కరుణాపీఠము ఎదుట ఏడుస్సార్లు ప్రోక్షించెను.దేవుని యొక్క పరిపూర్ణతకు ఏడు ఒకగుర్తు.తదుపరి అతడు పరిశుద్ధ స్థలములోనికి వెనుకకువచ్చి అడ్డ తెర ముందు ఏడుసార్లు ఈ రక్తమును ప్రోక్షించును,మిగిలిన రక్తము తాత్కాలికంగా పరిశుద్ధస్థలములో యుంచబడును.

**యెహోవా పేరిట యున్నమేక వధించబడుట:**

అప్పుడతడు ప్రత్యక్షగుడారము

నుండి బయటకివచ్చి ప్రజలర్పించు పాప పరిహారార్థబలియగు మేకను,అనగా యెహోవా పేరిట చీటివచ్చిన మేకను వధించి అతడు తెరలోనికి దాని రక్తము తెచ్చి ఆ కోడె రక్తముతో చేసినట్లు దీని రక్తముతోను చేసి కరుణాపీఠము ఎదుటను కరుణాపీఠము మీదను దాని ప్రోక్షింపవలెను(లేవీ 16:15).అతడు ఇశ్రాయేలీయుల పాపమును బట్టియు అపవిత్రను బట్టియు పరిశుద్ధస్థలమునకు ప్రాయశ్చిత్తము చేయవలెను."మరియు అతడు యెహోవాసన్నిధి నున్న బలిపీఠము నొద్దకుపోయి దానికి ప్రాయశ్చిత్తము చేయవలెను.అతడు ఆ కోడెరక్తములో కొంచెమును మేక రక్తములో కొంచెమును తీసికొని బలిపీఠపు కొమ్ములమీద చమిరి యేడు మారులు తన వ్రేలితో ఆ రక్తములో కొంచెము దాని మీద ప్రోక్షించి ఇశ్రాయేలీయుల అపవిత్రను పోగొట్టి దానిని పరిశుద్ధపరచవలెను"(లేవీ 16:18-19).

అజాజేలు మేక

అహరోను పరిశుద్ధస్థలమునకును ప్రత్యక్షగుడారమునకును బలిపీఠమునకును ప్రాయశ్చిత్తము చేసిచాలించిన తరువాత ఆ సజీవమైన మేకను తన దగ్గరకు తీసికొనిరావలెను.అప్పుడు అహరోను ఆ మేకతల మీద తనరెండు చేతులుంచి ఇశ్రాయేలీయుల పాపములన్నియు,దోషములన్నియు దాని మీద ఒప్పుకొనవలెను.ఈ రీతిగా వారి పాపములన్నియు దాని తలమీదికి మార్పుచేయబడెను(లేవీ 16:20,21). ఈలాగు చేసిన తరువాత తగిన మనుష్యుని చేత దానిని అరణ్యములోనికి పంపవలెను.ఆమేక వారి దోషములన్నిటిని ఎడారి దేశమునకు భరించిపోవును (లేవీ16:20,22).

అహరోను వస్త్రములు తిరిగి ధరించు కొనుట:

ఇప్పటివరకు జరిగిన సంస్కారములన్నియును అహరోను ఒక్కడే జరిగించెను.అప్పుడు అహరోను ప్రత్యక్ష గుడారములోనికి వచ్చి తాను వేసికొనిన నారబట్టలనుతీసి అక్కడ వాటిని ఉంచి, పరిశుద్ధస్థలములో దేహమును నీళ్లతో కడుగుకొనిబట్టలుతిరిగి ధరించుకొనును. యివి వివిధ వర్ణములు గల పరిశుద్ధతను, అంతమును ఘనతను సూచించు వస్త్రములు(నిర్గమ 28:2).

అహరోను బయటకి వచ్చితన కొరకు దహనబలిని ప్రజలకొరకు దహన బలిఅర్పించి తన నిమిత్తమును ప్రజల నిమిత్తమును ప్రాయశ్చిత్తము చేయును. పాపపరిహారార్థ బలి పశువు యొక్క క్రొవ్వుబలిపీఠము మీద దహింపబడును

(లేవీ 16:23,25).

పరిశుద్ధస్థలములో ప్రాయశ్చిత్తము చేయుటకు వధింపబడిన ఆ కోడెను,ఆ మేకను ఒకడు పాళెము వెలుపలకి తీసి కొనిపోయి వాటి చర్మమును,మాంసమును,మలమును అగ్నితో కాల్చివేయును (లేవీ 16:27).

**నేర్చుకొన దగిన పాఠములు:**

ప్రాయశ్చిత్తదినమున జరిగే సంస్కారముల నుండి మనమునేర్చుకొన దగిన అనేక పాఠములున్నవి.మొదటిగా అజాజేలు(విడిచిపెట్టే) మేకను గూర్చి తెలుసికొందము.అజాజేలు అనగా బలముతోనిర్మూలించబడుట యని అర్థమిచ్చును. ఇంకొక మాటలో ఇశ్రాయేలీయు ల పాపములు బలముతో నిర్మూలించబడెను.

రెండవదిగా వారిపాపములు పాళెమునుండి నిర్మూలించబడెను.ఆ మేకను బలిపశువు(Scape goat)అని పిలుతురు.పాపములను ఆ మేకయే భరించెను.గనుక ఈ మేకను అరణ్యములో విడిచిపెట్టినప్పుడు ఇశ్రాయేలీయులందరు దేవునికి"హల్లెలూయ"యని గట్టిగా పాటలుపాడుదురు.ఏలయనగా వారి పాపములు నిర్మూలించబడెనని వారెరుగు దురు.

మూడవదిగా యెహోవా మేక, అజాజేలు మేక–ఈ రెండును ఒకే బలిగా పరిగణింపబడెను.విమోచన ప్రక్రియలో యున్నరెండు పక్షములు అందులో యున్నవి."యెహోవామేక"విమోచనకు కారణమును ఆధారమునైయున్నది. 'అజాజేలుమేక'దాని యొక్క ప్రతిఫలము అనగా క్షమాపణ లభ్యమగుట.అనగా యేసుక్రీస్తులో మొదటిమేక నిజముగా చనిపోయెను.యేసుక్రీస్తు నిజముగా కల్వరిసిలువలో మరణించుట దీనిలో యున్నది.అయితే అదే బలిలోని రెండవ మేక సజీవముగా అరణ్యములోనికి కొని పోబడెను.యిది క్రీస్తుయొక్క పునరుత్థానమునకు సూచనగా యున్నది.ఆ బలి నుండి అది సజీవముగా బయటపడెను! అది మరణమునుండి జీవముపొందెను.

ఈ సంస్కారములన్నిటిలోను ప్రధానయాజకుడైన యేసుక్రీస్తు పాత్రను అహరోను ధరించెను.ప్రధానయాజకుడైన క్రీస్తుతన స్వకీయబలి యంతటిని తానే భరించెను. ఆయన ప్రజలపాపములను నిర్మూలించెను."ఆయన యుగముల సమాప్తియందు తన్నుతానే బలిగా అర్పించుకొనుట వలన" పాపనివారణ చేయగలిగెను అని హెబ్రీ 9:26-27 చెప్పుచున్నది.

ఆ రోజు అహరోను యొక్క సిద్ధపాటులోను,పాత్రలోను ఒక మంచి

పాఠము మనము నేర్చుకొనవచ్చును. అహరోను తనకు అలంకారమును ఘనతయు,పరిశుద్ధతయు కలుగునట్టి వస్త్రములను విడిచిపెట్టి సాధారణ నార వస్త్రములు ధరించుకొనవలసియుండెను. యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చినప్పుడు ఆయన తన దైవత్వమును విడిచినప్పుడు దైవత్వాన్ని విడిచిపెట్టి వినయవిధేయతలు గలిగి,దేవుని సేవకునిగా తిరిగి దర్శన మిచ్చెను.అహరోను సామాన్య నారబట్ట లను ఏలాగుధరించుకొనవలసి వచ్చెనో, యేసుక్రీస్తు సామాన్యమానవునిగా కనబడవలసి వచ్చెను.

ప్రాయశ్చిత్త కార్యక్రమములన్ని టిని జరిగించిన తరువాత అహరోను ప్రత్యక్షగుడారములోనికి వెళ్లితన ప్రధాన యాజకత్వపు ఘనతగల వస్త్రములను తిరిగి ధరించుకొనెను.అట్లే యేసు కూడ పరలోకమునకారోహణుడై దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడాయెను. యేసు క్రీస్తు మృతులలోనుండి పునరుత్థానుడైనం దున దేవుని కుమారుడని ప్రభావముతో నిరూపింపబడెను(రోమా 1:7).

ఇంకొక పాఠముయేమంటే ఇశ్రాయేలీయులు పాపములకు సంవ త్సరమునకొక మేక చొప్పున,ఆప్రజల 1400 సంవత్సముల చరిత్రకు 1400 మేకలు విడిచి పెట్టబడెను.అవి కేవలము అరణ్యములోనికి పంపబడుటయేకాదు, అవినిజానికి కల్వరిసిలువ యొద్దకు పంప బడెను.నిజానికి విశ్వాసనేత్రముతో చూడ గలిగితే యేసు ఆ 1400 మేకలుసిలువ చుట్టుయుండగా, వాటి తలలపై మోప బడిన పాపములన్నిటిని ఆయన తలపై మోపుకొని సిలువవేయబడెను.ఒక్కొక్క మేకపై యున్న పాపములన్నిటిని దేవుడు క్రీస్తు శిరస్సుపై మోపెను.అక్కడ యేసే ఆ పాపములన్ని జరిగించినట్లు ఆయన గమనించెను.ఆ పాపములన్నిటి యొక్క శిక్షను భరిస్తు యేసుసిలువపై మరణిం చెను (1వ పేతురు 2:24).

మూడుదినముల తరువాత యేసు మృతులలో నుండి తిరిగి లేచెను. దీనిని అజాజేలుమేక సూచించెను. యాబది దినములతరువాత ఆయన ఆరోహణుడై తండ్రి యొక్క కుడి పార్శ్వమున కూర్చొనెను.మరల తన దైవత్వమును తిరిగి ధరించుకొనెను. గనుక ప్రాయశ్చిత్తదినమందు జరిగింప బడే సంస్కారములన్నిటిలోను యేసుక్రీస్తు ప్రవచింపబడుచుండెననుట విదితమే.

"మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నారని"ఎఫెసీ2:8 చెప్పుచున్నది.దేవుడు తన కృపనుబట్టి ప్రజల పాపముల కొరకు బలిని అర్పించె నననది విశదమే.ఇంకొకమాటలో నీకు

బదులుగా ఈ జంతువును(బలిని)స్వీక రింతునని దేవుడు ఇశ్రాయేలీయులతో చెప్పినట్లున్నది. ఏలయనగా వధింపబడిన ఆ జంతువు నిజానికి యేసుక్రీస్తును సూచించుచుండెను. ఇంకొకమాటలో నీకు బదులుగా యేసు యొక్కబలిని నేనంగీకరించెదను. అయితే నీవు కూడ దానిని అంగీకరించాలని దేవుడు చెప్పు చున్నారు. అంటే యేసు యొక్కబలి ద్వారా తమపాపముల మూల్యము చెల్లించబడె నని మానవులందరు అంగీకరించాలి.

### బలులన్నిటి సంగ్రహము

ఇంతవరకు మనము స్టడీచేసిన బలులన్నిటిని సమీక్షించాలి. ప్రతియొక్క బలి క్రీస్తు యొక్క ఏకైక బలిలోని వివిధ భాగములని మనము గుర్తించాలి. అవన్ని కలపితే ఒక మొత్తము అగును. మోషేధర్మ శాస్త్రములోని ప్రతిబలియు,దహనబలి, నైవేద్యము,సమాధానబలి,పాపపరిహారార్ధ బలి,అపరాధపరిహారబలి,పశ్చాత్తపుదినమున జరిగింపబడే బలులు అన్ని క్రీస్తులో రూపకములుగా యున్నవి.

ప్రతివాడు తన స్వకీయపాపము వలన దేవుని యెదుటతన జీవితాన్ని కోల్పోయాడు. అతడు తన ప్రాణమును ఇంకొకని కొరకు ఇయ్యలేడు. ఏలయనగా దానిని పాపమునకప్పగింప చేసాడు. పాపము లేనివాడు మాత్రమే తన ప్రాణమును ఇంకొకని కొరకు ఇయ్యగల డు. గనుక యేసు పరలోకమునకారోహ ణుడైనప్పుడు ఆయన పాపములేనివాడై యుండాలి. ఆయన పవిత్రులైయుండాలి. అంటే ఆయన తన జీవితమంతయు దేవునికి సంపూర్తిగా సమర్పించుకొని యుండాలి. ఇంకొకమాటలో ఆయన దహనబలిలో యున్న రూపకములన్నిటిని పూర్తిగా నేరవేర్చియుండాలి. ఆయన జీవితంలో ఒక్కసారి కూడ ఆయన సమర్పణను,పరిశుద్ధతను,పవిత్రతను ఆరి పోనీయలేదు. ఆయన సిలువపైనెక్కిన ప్పుడు దేవుడు మానవునిపాపమును, క్రియలను యేసుపైమోపెను. అవి ఆయన పాపములే అన్నట్లు ఆయనపై మోపి ఆయనను శిక్షించెను. మరియు నిర్దోష మైన యేసుక్రియలను,పరిపూర్ణతను బట్టి యేసుకు విధేయత చూపువానిని దేవుడు అంగీకరించును,అందువలననే కల్వరిలో చిందింపబడిన రక్తమును బట్టి దేవుడు క్రైస్తవుని పవిత్రునిగా ఎంచును.

పాపపరిహారము చెల్లించిన తరువాత యేసుక్రీస్తు యొక్కబలి యాగము యొక్క ప్రధమ ఫలముగా తనను దేవునికి సమర్పించు వానినొకనిని మానవునికి అవుసరమాయెను. మరియు మానవుడు దేవునితో సమాధానముగా యుండునట్లు చేయు వాడొకడు మానవు

నికి అవుసరమాయెను. మరియు మానవుడు దేవునితో తన సహవాసమును పునరుద్ధరింపబడి సమాధానము కలిగి యుండగలడు. అప్పుడు మానవుడు, దేవుడు కూడ క్రీస్తురాజ్యములో ఆయన సమాధానబలి వలన పండుగవిందులో పాల్గొనవచ్చును. గొర్రెపిల్ల యొక్క విందు భోజనము దేవునితో సమాధానపడుట వలన సాధ్యమాయెను(ప్రకటన 19:9).

మరియు ఆ బలియాగములలో యున్న రూపకములన్నియు క్రీస్తులో నెరవేరెను. అదేరీతిగా ప్రధాన యాజకుని విధులన్నియు క్రీస్తులో నెరవేరెను. అహరోను ప్రధానయాజకుడైన క్రీస్తును సూచించుచున్నాడు. మానవుడు పాపము నుండి రక్షింపబడి, రక్షింపబడిన స్థితిలో కొనసాగుటకు ఇవన్నియు క్రీస్తులో నెరవేరవలసి యుండెను. విశ్వాసముతో విధేయత గలవారినందరినీ ఆయన రక్షించును, రక్షించుచుయుండెను. "ఆయన తనకు విధేయులైన వారందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను"(హెబ్రీ 5:10). "చెప్పశక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము"(2కొరింథి 9:15).

## ఒకటి
*(One)*

దేవుడు మన జీవితములో మరి యొక నూతన సంవత్సరమును అనుగ్ర హించారు. ఇన్ని సంవత్సరములు మన లను కాపాడి పోషించి సంరక్షించిన దేవునికి వందనములు చెల్లించాలి.

కాలేబు "ఈ నలుబదిఐదు ఏండ్లు ఆయన నన్ను సజీవునిగా కాపాడి యున్నాడు"(యెహోషు 14:10).

హానోకు 300 ఏండ్లు దేవునితో నడిచెను(ఆది 5:22). అనగా హానోకు దేవునితో సహవాసము చేసెను. గతించిన మన జీవితము చూచుకొంటే దేవునితో సహవాసము కలిగి యున్నామా? ఈ సంవత్సరమునుండి ఆయనతో సహవాసము కలిగియుండాలని నిర్ణయము తీసికొందాము. మన తప్పిదములను వాక్యమును బట్టి సరిచేసుకుందాము.

నీకు ఒకటి కొదువగా యున్నది (మార్కు 10:21).

ఒక యౌవనస్థుడు నిత్యజీవ మును పొందుటకు ఏమిచేయాలని తెలిసి కొనుటకు యేసునొద్దకు వచ్చాడు. నిత్యజీవమును గూర్చి ఈ యౌవనస్థుని యొక్క అవగాహ నను పరిశీలిస్తే

(ఎ)"నిత్యజీవమును పొందుటకు ఏ మంచి కార్యము చేయాలి"అని ప్రభువును అడిగాడు(మత్తయి 19:16).

మంచిపనులు,పుణ్యకార్యాల వలన పరలోకముపొందుకోగలమని ఇతని అభిప్రాయము.రక్షణను గూర్చిన నిత్యజీవమును గూర్చిన అవగాహనలో కొదువగా యున్నాడు."మీరు విశ్వాసము ద్వారా దేవుని కృపచేతనే రక్షింపబడి యున్నారు.ఇది మీవలన కలిగినదికాదు. దేవునివరమే.అదిక్రియల వలన కలిగినది కాదు గనుక ఎవరును అతిశయింప వీలులేదు"(ఎఫె 2:8,9).

(బి)"బాల్యము ఉండి నేను ఈ ఆజ్ఞలను గైకొనుచున్నాను"(మార్కు 10:20).నేను ఏ తప్పు చేయలేదు.నేను ఏ పాపము చేయలేదు.నేను నీతిమంతుడను అనే అపోహ.కాని దేవుని వాక్యము ఈలాగు చెప్పుచున్నది."నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు"(రోమా 3:11).

"ఏ భేధమును లేదు అందరూ పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమ ను పొందలేక పోవుచున్నారు"(రోమా 3:23).

"ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలముగా ఏమనుష్యుడును నీతిమంతుడుగా తీర్చ బడడు(రోమా 3:20).

"కాబట్టి విశ్వాసము ద్వారానే మనము నీతిమంతులముగా తీర్చబడు చున్నాము(రోమా 3:24).

(సి)దేవుని ప్రేమించుట విషయములో కొదువగా యున్నాడు.

"అతడు దేవునికంటే ధనమును ఎక్కువగా ప్రేమించుట వలన ప్రభువును వెంబడించుటకు ఇష్టపడలేదు"(మార్కు 10:22).

మనము వేటిని ఎక్కువగా ప్రేమిస్తున్నాము ధనమునా,వస్త్రములనా, విలువగలవాటినా?లేక దేవునినా?

నీకు ఒకటి కొదువగా ఉన్నది అని ప్రభువు చెప్పుచున్నారు. అది ప్రార్థనా?వాక్యమును ధ్యానించుటా? సంఘసహవాసమా?లేక ప్రభువును వెంబడించుటలోనా?పరీక్షించుకొందము.

2. మీమధ్య శాపగ్రస్తమైనది ఒకటి కలదు:(యెహోషు 7:13).యెహోషువా 7వ అధ్యాయంలో ఆకాను యొక్క జీవి తమును గూర్చిచదువగలము.ఆకాను పాపము తనకు,తనకుటుంబమునకు మరణం తెచ్చింది(యెహోషు 7:25). అంతేకాదు ఇశ్రాయేలీయులు హాయి పట్టణముపై ఓడిపోయారు(యెహోషు 7:5).దీనికంతటికి కారణం ఆకాను యొక్క పాపము. "మీ మధ్యశాపగ్రస్త మైనది ఒకటి కలదు.మీ మధ్యనుండ కుండా నిర్మూలము చేయువరకు మీ శత్రువుల యెదుట మీరు నిలువలేరు" (యెహోషు 7:13).

దేవుడు మనకు తోడుగా ఉండా లంటే మనమధ్య శాపగ్రస్తమైన పాపము (ద్వేషము,అసూయ,కోపము,మోసము, అబద్ధము మొద॥వి)ఉండకూడదు.

3.అవసరమైనది ఒక్కటే:లూకా 10:41. అందుకు ప్రభువు-మార్తా,మార్తా,నీవనేక మైన పనులను గూర్చివిచారము కలిగి తొందరపడుచున్నావుగాని అవసరమైనది ఒక్కటే.మరియ ఉత్తమ మైనది ఏర్పరచు కొనెను"

మరియ అవసరమైనది,ఉత్తమ మైనది ఆమె యొద్దనుండి తీసివేయబడ నిది ఏర్పరచుకొన్నది.మరియ దేవుని పాదాల వద్ద కూర్చొని ఆయన మాటలు వినుచుండెను.

ప్రభువుకొరకు ఏమిచేసామో కాదు ప్రభువుతో కలసి ఏమిచేస్తున్నామో అది ముఖ్యము.మార్త ప్రభువును తన ఇంటికి ఆహ్వానించిందిగాని ప్రభువును విడిచిపెట్టింది.మార్తప్రభువుకు ప్రాధాన్య ము ఇవ్వడంలో విఫలమైనది.

ప్రభువుకు ప్రాధాన్యము ఇవ్వక పోతే కలుగు నష్టాలు:

1.విస్తారమైన పనులు(లూకా 10:4).

2.తొందరపాటు(40)

3.ఒంటరి తనము(40)

4.సబంధాలలో బలహీనత (నా సహోద రిననువిడచి(40)

5.నిస్సహాయము 41వ

6.దేవునిపై నేనిందవేయుట(చింతలేదా?)

7.విచారము(41వ)

కనుక అవసరమైనది ఒక్కటే. అది దేవునితో సహవాసము కలిగియుం డుట.ప్రభువు కార్యభివృద్ధియందు పాలు పంచుకొనుట.

4.ఒకటి చేయుచున్నాను:

"అయితే ఒకటి చేయుచున్నాను వెనుకఉన్నవి మరచి ముందున్నవాటి కొరకై వేగిరపడుచున్నాను.క్రీస్తుయేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని గురి యొద్దకే పరుగెత్తుచున్నాను"(ఫిలిప్పీ 3:13,14).

పౌలుకు తన ముందున్న గురి ఏదనగా నిత్యజీవము.ఈ లోకసంబంధ మైన వాటిని పెంటతో సమానముగా ఎంచుకొన్నాడు.ఈలోకమును లోకములో ఉన్న వాటినైనను ఆశించకూడదు.మన అపజయాలు మనలను నిరుత్సాహపరచి ముందుకు సాగకుండా అక్కడే నిలచి పోయేటట్లుగా చేస్తాయి.గాని ప్రభువులో మనము ముందుకు సాగిపోవాలి.

ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడచివచ్చినను ఐగుప్తు జ్ఞాపకాలను విడువక నశించిపోయారు.వెనుకకు చూడకుండా పొమ్మని చెప్పినా,లోతు

భార్య వెనుదిరిగి చూచి ఉప్పుస్తంభముగా మారినది.

యోసేపు తన సహోదరులు చేసిన కీడంతటిని మరచి సహోదరులతో సమాధానముగా యుండి కరువులో వారిని ఆదుకున్నాడు. ఆయావ్యక్తులను క్షమించేవారముగా యుండాలి. ప్రభువు జీవితమును ఒకసారి జ్ఞాపకము చేసుకుంటే "ప్రభువు తన ఎదుట ఉంచబడిన ఆనందము కొరకు అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి, దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు" (హెబ్రీ 12:2).

ప్రభువును ప్రేమించుటలో కొదువ కల్గియున్నామా? పరిశుద్ధముగా జీవించే విషయములో రాజీపడిపోయి క్రీస్తుతో సహవాసములో వెనుకబడి యున్నామా? ప్రార్థనయందు, వాక్యముచదువుట యందు, సంఘ కార్యక్రమములలో పాలి భాగస్థులుగా యుండుటలో వెనుకబడి యున్నామా?

దేవుని కార్యాభివృద్ధి యందు ఎల్లప్పుడు ఆసక్తి కల్గియుండుటకు దేవుడు మనకు సహాయము చేయునుగాక!

- B.S.A సువార్త


**సత్యవాణి-క్రీస్తుసంఘము**

7-9-35 సాంబమూర్తి వీధి, రామారావు పేట

కుళాయిచెర్వు ఎదురుగా, కాకినాడ-533 004.

**ఆరాధన:**

ప్రతి ఆదివారము: ఉదయం 9:30 గంటలకు **బైబిలుస్టడీ**

ఉదయం 10:30 గంటలకు **ఆరాధన**

ప్రతి బుధవారం :సాయంత్రం 6:30 గంటలకు **బైబిలు క్లాసు**

ప్రతి శుక్రవారం :సాయంత్రం 4:00 గంటలకు **స్త్రీల కూడిక**

అందరు ఆహ్వానితులే.

## “దేవుడే ప్రతిఫలమిచ్చును”
## *( God will Repay)*

హెబ్రీ 10:30 లో పౌలు ఇట్లు చెప్పాడు:“పగతీర్చుట నాపని,నేనే ప్రతి ఫలమిత్తుననియు,ప్రభువు తన ప్రజలకు తీర్పుతీర్చును అనియు చెప్పిన వానిని ఎరుగుదుము గదా”. ఈ జీవితంలో మనమేమి చేసామో దానినే తిరిగి పొందునట్లు దేవుడు ఈ జీవితంలోను రాబోవు జీవితంలోను తప్పకచూస్తాడు. మనం ఏమి విత్తుదుమో దానినే పొందు దుమని మొదట గమనిద్దాం.“మోసపోకుడి దేవుడు వెక్కిరించబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలయనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంటకోయును. ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంటకోయును”(గలతీ 6:7-8).

ప్రతివాడు ఏదోఒకటి విత్తుచు యున్నాడు.మరియు అది శరీరేచ్ఛలను బట్టిన విత్తనమైన యెడల దాని పర్యవస నాన్ని తప్పకకోస్తాడు.రెండవదిగా,మన మేమి యిచ్చామో సరిగ్గాదానినే పొందుతాము.2కొరింథీ 9:6 లో పౌలు ఇట్లు చెప్పాడు: “కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును.సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును అని యీ విషయమై చెప్పవచ్చును”.నీకున్న దానిని యితరులకు వినియోగించేవరకు ఈ లోకంలో నీకు కలిగిన దంటూ యేమీ వుండదు.నీకున్న దాన్ని దాచిపెడితేదాన్ని తప్పక పోగొట్టుకొంటావు.

మూడవదిగా నీవు యితరులకెట్లు తీర్పుతీర్చావో అట్లే నీకును తీర్పుతీర్చ బడును. మత్తయి 7:1-3 లో యేసు ఇట్లు చెప్పెను:“మీరు తీర్పుతీర్చకుడి,అప్పుడు మిమ్మును గూర్చి తీర్పుతీర్చబడదు.మీరు తీర్చుతీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పుతీర్చబడును. మీరు కొలుచు కొలత చొప్పుననే మీకును కొలవబడును”. మరల“కనికరము గలవారు ధన్యులు వారు కనికరము పొందుదురు”అనికూడ ఆయన చెప్పెను (మత్తయి 5:7). “కనికరము చూపనివాడు కనికరము పొందుతీర్పు పొందును;కనికరము తీర్పును మించి అతిశయ పడును” అని యాకోబు హెచ్చరించాడు (యాకోబు 2:13).

చివరిగా,ఈలోకంలో మనం క్రీస్తును ఎట్లు పరామర్శించామో అదే విధంగా ఆయన మనలను కూడ పరామర్శించును. మత్తయి 10:32లో యేసు ఇట్లు చెప్పెను:"మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగ ననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును"

నీవు ఈ లోకంలో జీవించు చుండగా నిత్యసన్నిధిలో యేమేమి దాచు కొన్నావో వాటిని తిరిగి పొందునిమిత్తము ఒకానొక దినమందు ఆ గొప్ప యజమాని యెదుట నిలువబడబోవు చున్నావు. నీవు యేమిపొందుతావు?

-జాన్ స్టేసీ.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.